క్లుప్తంగా

2న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం



సునీల్‌కుమార్

పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సర్వసభ్య సమావేశం డిసెంబర్ 2న ఉదయం 10.30 గంటలకు ఐరాల మండలం కాణిపాకం క్రాస్ వద్దనున్న నారాయణాద్రి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, రాయలసీమ కో–ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని, నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రాష్ట్ర కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మురకంబట్టులో వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని మురకంబట్టులో మంగళవారం అపోలో కళాశాల ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. వైద్యులు వంశీ, అమరనాథ్ మొత్తం 80మంది వృద్ధులకు బీపీ, మధుమేహ పరీక్షలు చేశారు. వృద్ధాప్యంలో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్‌కుమార్, మహేంద్రనాథ్, జయంతి, మాధ్యూ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాడతాం



ఉద్యోగులతో మాట్లాడుతున్న పూర్ణం

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని వాణిజ్య పన్నులశాఖ సర్వీసెస్ అసోసియేషన్ చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు పూర్ణం అన్నారు. మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల భవనం ఆవరణలో భోజన విరామ సమయంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఐక్యంగా పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతుందన్నారు. హక్కుల అమలు కోసం అందరూ సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్, ప్రసాద్‌రెడ్డి, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, జగదీష్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా చేసుకోవాలని, ఏఓ వరలక్ష్మి కోరారు. ఈ విషయమై వీపీఏలు తమ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మంగళవారం మండలంలోని పుత్రమద్ది ఆర్‌ఎస్‌కే కేంద్రంలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అకాల వర్షాలకు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు పంట నష్టపోయిన రైతులకు బీమా రక్షణగా ఉంటుందన్నారు. వరి పంట సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.84, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.60 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. మల్బరీ పంట సాగు షెడ్ నిర్మాణం కోసం ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రైతులు మల్బరీ సాగుపై దృష్టి సారించాలని సెరికల్చర్ అసిస్టెంట్ గణేష్‌గౌడ్ కోరారు. ఉద్యానవన శాఖ తరపున రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు సబ్సిడీపై ఇస్తున్నామని, కొబ్బరి సాగు చేసే రైతులు అంతర పంటగా కోకో పంట సాగు చేసుకోవచ్చని వీహెచ్‌ఏ రామచైతన్య తెలిపారు. అలాగే రైతులు కొత్తగా సాగు చేసే మామిడి, కొబ్బరి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, ఉసిరి, చింత తదితర పంటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాలు వద్దు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని ఎన్టీఆర్ బస్టాండ్ మార్కెట్‌లో రోడ్డు ను ఆక్రమించి కొందరు వ్యాపారాలు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర రోడ్డుపైన వ్యాపారం చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కొన్ని దుకాణాలను తొలగించారు. ట్రాఫిక్ కు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రమపద్ధతిలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువు.. కరువు

అన్నదాతలకు అగచాట్లు మళ్లీ మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో వ్యవసాయానికి కావలసిన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, యంత్రపరికరాలు అన్నీ గ్రామంలోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతుల సంక్షేమానికి తిలోదకాలిచ్చింది. 'వ్యవసాయం దండగ' అని ఒకప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన రైతాంగ వ్యతిరేక విధానాలను ఇప్పుడు అమలు చేస్తోందా!? పరిణామాలు అలాగే ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. వరి పంటకు ఎరువులు అందించే దిశగా చర్యలు తీసుకోలేదు.

- మూలనపడిన కియోస్క్ యంత్రాలు
- సకాలంలో అందని ఎరువులు
- అన్నదాతలకు మొదలైన అగచాట్లు



ఎగటిపూట మూతబడినున్న రైతు సేవా కేంద్రం

పూతలపట్టు: మండలంలో రైతులు ఈ సీజన్లో వరి పంట సాగు చేశారు. విత్తనాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోయినా ఏవో కష్టాలు పడి సాగు చేశారు. కనీసం ఎరువులైనా సకాలంలో ప్రభుత్వం అందిస్తుందేమోనని ఆశపడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం అది కూడా చేయలేదు. అన్నదాతా సుఖీభవ పథకం పేరిట పెట్టుబడి సాయం చేస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టి, తీరా అధికారంలోకి వచ్చాక అన్నదాతలను పూర్తిగా విస్మరించింది. గత ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ఎత్తుగడ వేస్తోంది. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలేవీ వాటిల్లో ఉంచడం లేదు. పైగా సిబ్బందికి వేరే పనులు పురమాయిస్తోంది. ఫలితంగా రైతు సేవా కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 96 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు మంచి సేవలు అందాయి. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యవసాయ యంత్రాలు, మార్కెట్ ధరలు, మార్కెట్ వివరాలు, తదితర సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునే వీలుండేది. దీంతోపాటు వాతావరణ సమాచారం, మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. అయితే కొత్త ప్రభుత్వం రాకతో కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వంతో పాటు అధికారుల తీరును రైతులు తప్పుపడుతున్నారు.

రైతులకు ఎరువులు ఇస్తున్నాం

పూతలపట్టులో 2,770 ఎకరాలకు ప్రస్తుతానికి 300 బస్తాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో రైతులకు ఎరువులను ఇస్తున్నాం. ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లేనప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేసి స్టాక్ వచ్చిన తరువాత రైతులకు ఇస్తున్నాం. కియోస్క్ యంత్రం టెక్నికల్ సమస్యలతో అప్పుడప్పుడు పనిచేయడం లేదు.

– మధురవాణి,
మండల వ్యవసాయాధికారి, పూతలపట్టు

అందుబాటులో లేని ఎరువులు

నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు సరిపడా లేదు. ఎప్పుడైనా అడిగినా ఇక్కడేమీ లేవు అనే సమాధానమే వస్తోందని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 41,325 మంది రైతులు సుమారు 13,300 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. ముఖ్యంగా ఇక్కడ వరి, రాగి, వేరుశనగ, మామిడి, టమాట ఇతర కూరగాయలను సాగు చేస్తున్నారు. ఈ పంటలకు యూరియా, కాంప్లెక్స్, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు ఉపయోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో అన్ని రకాల ఎరువులు రైతుభరోసా కేంద్రంలో అందుబాటులో ఉండేవి. నేడు ఆ ఎరువులు లేక రైతులు అల్లాడిపోతున్నారు.

మూలనపడిన కియోస్క్ యంత్రం

గత ప్రభుత్వం పాలనలో అమలు చేసిన పథకాలన్నింటినీ నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి రైతుల సౌకర్యార్థం తీసుకొచ్చిన కియోస్క్ యంత్రాలను మూలన పడేశారు. వాస్తవానికి నాడు రైతులకు ఎంతో మేలు చేకూర్చిన కియోస్క్ యంత్రాలు ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. ఇలా ప్రజాధనం వెచ్చించి ప్రయోజనాలు కల్పిస్తున్న కియోస్క్‌లను నిరుపయోగంగా పడేయడం ఏంటన్న విమర్శలు వస్తున్నాయి. రైతులు తమ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసింది.



నిరుపయోగంలోనున్న కియోస్క్ యంత్రం

ఆర్‌బీకేలకు తాళాలు

సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారులు ఏదో చుట్టం చూపుకొచ్చినట్లు కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నారు. రైతుల సమస్యలను అస్సలు పట్టించుకోవడం లేదు. రైతులు వారి అవసరాల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. దానికి కారణం నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది తక్కువ మంది ఉండడమే. ఒక్కొక్కరిని 3, 4 రైతు సేవా కేంద్రాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించడం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని చోట్ల ఏఈఓలు కూడా ఇన్‌చార్జ్‌లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తగిన సిబ్బంది లేక కేంద్రాలకు తాళాలు వేశారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం మొక్కుబడిగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఇస్తున్నారు. ఫలితంగా ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే పూర్తయింది. రబీ సీజన్‌లోనైనా కియోస్క్ యంత్రాలు వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

28న మామిడి రైతుల సదస్సు

తవణంపల్లె: మండలంలోని మామిడి రైతులకు 28వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు అరగొండ గౌరీ శంకర కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల ఉద్యానవన శాఖాధికారిణి సాగరిక తెలిపారు. మామిడి తోటలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులపై ఉద్యానవన శాఖ, వైఎస్సార్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారన్నారు. దీనిని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూబీఐలో కొనసాగుతున్న ఆడిటింగ్

పూతలపట్టు: యాదమరి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అప్రైజర్ చేతివాటంపై ఆడిటింగ్ అధికారుల క్షుణ్ణంగా రికార్డులను పరిశీలిస్తున్నారు. ఆడిటింగ్ శనివారమే ముగిసినా అప్రైజర్ భాస్కరాచారి బాగోతాలపై అధికారులు నిశితంగా తనఖా నగలను పరిశీలిస్తున్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలలలో పాటు అక్టోబర్, నవంబర్ నెల ఫైళ్లను పరిశీలిస్తున్నారు. అప్రైజర్ ఎవరెవరి బినామీ ఖాతాలతో తక్కువ క్వాలిటీ బంగారం కుదువ పెట్టి, ఎక్కువ మొత్తంలో రుణం పొందాడో వాటి వివరాలపై నివేదిక సిద్ధం చేసి ఎస్‌ఐకు ఇవ్వనున్నట్టు బ్యాంకు అధికారులు చెప్పారు. అంతేగాక సుమారు రూ.52 కోట్ల విలువగల ఖాతాదారుల నగలు సురక్షితంగానే ఉన్నాయని మరోసారి స్పష్టం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి రూ.2.20 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాల తనిఖీ చేశారు. పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 22 మందిపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం

తవణంపల్లె: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని టీ.పుత్తూరు కోదండ రామాలయంలో మంగళవారం హనుమంతునికి విశేష పూజలు, హోమాలు చేశారు. ఉదయం ఆలయంలో సీతారాముల సమేత లక్ష్మణులకు వేదపండితులు శాస్త్రోకంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పుష్కరిణి వద్ద కొలువుదీరిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సుదర్శన యాగం, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగానికి అంకురార్పణం చేశారు. బుధవారం పుష్పయాగం నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

వైభవంగా హనుమంతుని వాహనసేవ

రాత్రి హనుమంతుని వాహనసేవ నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తులైన సీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామికి పూజార్చన అనంతరం హనుమంత వాహనంపై సీతారామ లక్ష్మణులు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



యాగం చేస్తున్న పండితులు



స్వామి హారతి స్వీకరిస్తున్న భక్తులు

దోమల నిర్మూలన, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో దోమల నిర్మూలన, పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. జానకారపల్లె వద్ద నిల్వ నీటిలో దోమలు లార్వాల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ వేశారు. నగరంలో అన్ని వార్డుల పరిధిలో నిల్వ నీటిని గుర్తించి ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రేయింగ్ విస్తృతంగా చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు నిర్దేశించిన సమయం విధుల్లో ఉండేలా పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం పాల్గొన్నారు. అనంతరం మెసానిక్–రిజర్వ్ ఫారెస్టు రోడ్డు విస్తరణ ప్రతిపాదనపై పంచాయతీరాజ్ డీఈ కృష్ణ, ఏఈ లోకేష్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. 3.2 కి.మీ దూరం ఉన్న రోడ్డును రెండు వైపులా విస్తరించాలని అధికారులు చర్చించారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వ్యాధులు దూరం

ఐరాల: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వ్యాధులు దరి చేరవని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం వీఎస్.అగ్రహారంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాపినాయుడుపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని బాపినాయుడుపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి తవణంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

మునిసిపల్ స్టాండింగ్ కమిటీలో పనులకు ఆమోదం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించారు. మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కె.నిర్మల, ఆర్.శశికుమార్, ఎస్.సుష్మా, కె.అశోక్ పాల్గొన్నారు. అజెండా అంశాలైన.. 9వ వార్డు ఆఫీసర్స్ లేన్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.12.80 లక్షలతో రూపొందించిన అంచనాలను సాధారణ నిధుల నుంచి వ్యయం చేయడానికి, 7వ వార్డు పరిధిలోని బాపూజీ నగర్‌లో రూ.14.80 లక్షలు, 9వ వార్డు నలందనగర్‌లో రూ.16.20 లక్షలు, మైత్రి నగర్‌లో రూ.26.10 లక్షలను సీసీ రోడ్ల నిర్మాణానికి 2024– 25 సాధారణ నిధుల నుంచి వ్యయం చేయడానికి పాలకవర్గం ఆమోదించింది. నగరంలో పలు ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా కోసం ఈనెల నుంచి వచ్చే ఏడాది వరకు రూ.39.90 లక్షలు వ్యయం చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. సమావేశంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ అముద, కమిషనర్ తదితరులు

రాజ్యాంగం..సమన్యాయం



అంబేద్కర్ విగ్రహం వద్ద జోహార్ అంటూ నినాదాలు చేస్తున్న గాయత్రీదేవి, సరళమేరి నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళి అర్పించారు. పార్టీ జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళమేరి పలువురు నాయకులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం గాయత్రీదేవి మీడియాతో మాట్లాడారు. ఎందరో మేధావులు, న్యాయనిపుణులు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రూపొందించారన్నారు. దాదాపు రెండేళ్లపాటు కష్టపడి రూపొందించారని, ఉన్నత విలువలతో ప్రజలు జీవించాలని వీటిని ఆమోదించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ రాజ్యాంగపరంగా మేలు చేశారని, ఆయన బాటలోనే బడుగులకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడిచారని పార్టీ నాయకుడు ప్రకాష్ పేర్కొన్నారు. అలాగే రజనీ, ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అప్పు, లక్ష్మణస్వామి, అను, శేఖర్, రాజశేఖర్, ప్రేమ్, స్టాన్లీ, అంజలిరెడ్డి, ప్రతిమారెడ్డి, నౌషద్, భారతి, కెప్టెన్‌శివ, శశికళ, అల్తాఫ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

- జెడ్పీ సమావేశమందిరంలో ఉద్యోగులతో సీఈఓ రవికుమార్‌నాయుడు మాట్లాడారు. ప్రజల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అనంతరం ఉద్యోగులతో రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్ర పటానికి ఏఎస్పీ రాజశేఖర్ రాజు, కార్యాలయ అధికారులు పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యాలయ పరిపాలన అధికారి నాగభూషణమ్మ, ఏఏఓ దస్తగిరి పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో..

చిత్తూరు మునిసిపల్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య దేశాలకు దిక్సూచి రాజ్యాంగం

పూతలపట్టు: ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలకు దిక్సూచి భారత రాజ్యాంగమని సర్పంచ్ మాసిలామణి అన్నారు. మంగళవారం మండలంలోని రంగంపేటలో అంబేద్కర్ చిత్రపటానికి, మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచ్ మణి, ఎంపీటీసీ నాగరాజు, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రమేష్, నాయకులు జీవరత్నం, మునిరత్నం, రామూర్తి, బాలాజి, షణ్ముగం, దాము, సుబ్రమణ్యం, వినాయక, రవీంద్రబాబు, రవి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: భారత రాజ్యాంగం మహోన్నతమైనదని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గిరిబాబు అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రపంచ దేశాల రాజ్యాంగాల ప్రత్యేకతలన్నింటినీ తనలో ఇముడ్చుకుని దేశంలోని ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేస్తోందని మన భారత రాజ్యాంగమేనన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మురళి మాట్లాడారు..అనంతరం విద్యార్థులకు భారత రాజ్యాంగంపై పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డి రామనాథం అన్నారు. కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాజ్యాంగ గొప్పదనాన్ని, రాజ్యాంగ రచనకు అంబేద్కర్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం స్థానిక వారపు సంత వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్ గోపి పాల్గొన్నారు.



పూతలపట్టు: రంగంపేటలో..



చిత్తూరు అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో..



బంగారుపాళెం: ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఐరాల: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు